
andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

నిజామాబాద్
జిల్లా వార్తలు

5

శనివారం 30 ఆగస్టు 2025







సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో పవన్

సైక్లింగ్ పోటీలు

సుభాష్‌నగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా సైక్లింగ్ సంఘం ఆధ్వర్యంలో నగరంలో విద్యార్థులకు సైక్లింగ్ పోటీలను నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్‌లో శుక్రవారం సైక్లింగ్ పోటీలను జిల్లా క్రీడల, యువజన శాఖ అధికారి పవన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ క్రీడాదినోత్సవాన్ని క్రీడా దిగ్గజాలను గౌరవించుకోవడానికి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిట్ ఇండియామిషన్ సహకారంతో మూడు రోజులపాటు దేశవ్యాప్తంగా జాతీయ క్రీడా దినోత్సవ సంబరాలను నిర్వహిస్తుందని తెలిపారు. అనంతరం రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భూలోకం విజయ్ కాంత్‌రావు మాట్లాడుతూ ఈ ప్రత్యేకమైన రోజు క్యాలెండర్‌లో మాత్రమే (మిగతా 8వ పేజీలో..)

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

» జిల్లా వైద్యాధికారి రాజశ్రీ

భీమ్‌గల్, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్యసిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని జిల్లా వైద్యాధికారి రాజశ్రీ ఆదేశించారు. పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి అందుబాటులో ఉన్న మందుల వివరాలను డాక్టర్ అజయ్ పవర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ కారణాలతో ఆసుపత్రికి వచ్చే ప్రజలకు వైద్యసేవలు అందించాలని సూచించారు.



ఎటు చూసినా.. ఇసుక మేటలే

- జిల్లాలో తీవ్ర నష్టం చేకూర్చిన వర్షం
- మునిగిన పొలాల్లో నీళ్లు.. ఇసుక దిబ్బలు
- 41వేల ఎకరాలలో నష్టం
- దెబ్బతిన్న 33 పంచాయతీ రాజ్ రోడ్లు, 22 ఆర్అండ్‌బీ రోడ్లు
- విద్యుత్ శాఖకు రూ.30లక్షలకు పైగా నష్టం
- నేలమట్టమైన 5 ఇళ్లు, పాక్షికంగా దెబ్బతిన్నవి 43
- మంజీరా బ్యాక్‌వాటర్‌లో హంగర్గ, సాలూరా, ఖాజాపూర్, హున్సా, మందర్న గ్రామాలు
- గోదావరి బ్యాక్‌వాటర్‌లో మిట్టాపూర్, అల్జాపూర్, నీలా, తాడ్‌బిలోలి గ్రామాలు
- పలు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు

జిల్లాలో కురిసిన భారీ వర్షం రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. జిల్లావ్యాప్తంగా కురిసిన వర్షంతో పంట నష్టంతో పాటు పలు ప్రాంతాలలో రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. పలు మండలాలలో కురిసిన కుండపోత వర్షంతో ఆ ప్రాంతాల్లోని పంట పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంటలు చేతికి వచ్చే పరిస్థితి లేకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

నిజామాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సిరికొండ, ధర్పల్లి, భీంగల్, ఇందల్వాయి, మండలాల్లో గతరెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా తీవ్రంగా పంటనష్టం జరిగింది. సిరికొండ, ధర్పల్లితో పాటు భీంగల్ మండలాలలో పలు ప్రాంతాల్లో పంట పొలాల్లో ఇసుక మేటలు వచ్చాయి. బోధన్, నవీపేట మండలాలతో పాటు రేంజల్ మండలాలలో గోదావరి, మంజీరా పరివాహక ప్రాంతంలో పలు గ్రామాలలో పంటలు నీటమునిగాయి. గోదావరి బ్యాక్ వాటర్‌తో పాటు మంజీరా ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆ పరివాహక ప్రాంతంలోని గ్రామాలలో పంటలన్నీ నీట మునిగాయి. వర్షాల కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. ఆర్అండ్‌బీ శాఖకు సంబంధించి 45 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతినగా పంచాయతీరాజ్‌కు సంబంధించి 35 కిలోమీటర్ల రోడ్లు దెబ్బతిన్నాయి. జిల్లా వ్యాప్తంగా వర్షాల వల్ల 41వేల 98 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక నివేదికను సిద్ధం చేశారు. 1021 ఎకరాల్లో ఇసుక మేటలు వేసినట్లు అధికారులు తేల్చారు. జిల్లా వ్యాప్తంగా 5 చెరువులు తెగిపోయినట్లు తెలుస్తోంది. భారీ వర్షం విద్యుత్ శాఖకు సైతం తీవ్రనష్టాన్ని కలిగించింది. వర్షం వల్ల జిల్లా వ్యాప్తంగా 264 స్థంభాలు నేలమట్టం కాగా 30లక్షల వరకు నష్టం కలిగింది. జిల్లా వ్యాప్తంగా 5 ఇండ్లు పూర్తిగా నేలమట్టం కాగా, 43 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. 12 పునరావాస కేంద్రాలను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేయగా 1229 మంది ప్రస్తుతం వాటిలో ఆశ్రయం పొందుతున్నారు. వర్షాల వల్ల రోడ్లు దెబ్బతినగా పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నవీపేట మండలం మిట్టాపూర్, అల్జాపూర్ గ్రామాలు గోదావరి నీటిలో జలదిగ్బంధం కాగా ప్రస్తుతం రాకపోకలు నిలిచిపోయాయి.

41వేల 98 ఎకరాల్లో పంటనష్టం

జిల్లావ్యాప్తంగా 41వేల 98 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక నివేదిక సిద్ధం చేశారు. 20వేల 660 మంది రైతులు నష్టపోయినట్లు తేల్చారు. ఇందులో ముఖ్యంగా 28వేల 131 ఎకరాలలో వరిపంట నష్టం జరుగగా 14వేల 663 మంది రైతులు నష్టపోయారు. పత్తి 81 ఎకరాలలో 47 మంది రైతులు, మొక్కజొన్న 565 ఎకరాలలో 382 మంది రైతులు, పెసర 5 ఎకరాలలో 8 మంది రైతులు, సోయాబిన్ 12వేల 54 ఎకరాలలో 5418 మంది రైతులు నష్టపోయినట్లు (మిగతా 8వ పేజీలో..)



ప్రాజెక్టు నుంచి గోదావరిలోకి విడుదల అవుతున్న నీరు

ఎస్సారెస్పీలోకి
4.5 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- 39 గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల
- ప్రధాన కాలువలకు కొనసాగుతున్న నీటి విడుదల

మెండోర, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల్లో నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి 4లక్షల 50వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 39 వరద గేట్ల ద్వారా 5లక్షల 50వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు శుక్రవారం ప్రాజెక్టు ఎస్ఈ జగదీష్ తెలిపారు. ప్రాజెక్టు నుంచి వరద కాలువ ద్వారా 12వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి 8వేల క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. 636 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00 అడుగులు 80.5 టీఎంసీలు కాగా శుక్రవారం సాయంత్రానికి 1085.7 అడుగులు 62 టీఎంసీల నీటి నిల్వ ఉందని ఎస్ఈ తెలిపారు.

నిజాంసాగర్ ప్రాజెక్టుకు తగ్గని వరద ఉధృతి 7

- ఎగువ నుంచి లక్షా 67వేల 944 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ఆ నీటిని మంజీరా నదిలోకి వదిలేస్తున్న అధికారులు



మోతె కప్పలవాగు వద్ద దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ప్రశాంత్‌రెడ్డి

భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

» బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): గతరెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో దెబ్బతిన్న వివిధ పంటలకు నష్టపరిహారం చెల్లించాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. శుక్రవారం వేల్పూర్ మండలంలోని మోతె, వేల్పూర్ వాగులపై ఉన్న బ్రిడ్జిలను, వరదకు దెబ్బతిన్న రోడ్లను, పంటలను సంబంధిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. రామన్నపేట్, వేల్పూర్ గ్రామాల మధ్య బీటీ రోడ్డు పూర్తిగా కోతకు గురికావడం వల్ల రాకపోకలు నిలిచిపోయాయని, రోడ్డును త్వరగా పునరుద్ధరించాలని రాకపోకలకు సౌకర్యం కల్పించాలని అన్నారు. ప్రిలిమినరి లెక్కల ప్రకారం 1162 ఎకరాల్లో వరి, 95ఎకరాల్లో మక్క, 35 ఎకరాల్లో సోయా పంట దిబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు చెప్పారన్నారు. కానీ ప్రతీ గ్రామంలో రైతులు తమ పంటలు నష్టపోయామని అంటున్నారని, మరొకసారి అధికారులు క్షేత్రస్థాయిలో పంటనష్టంపై పూర్తివివరాలు తీసుకొని ప్రభుత్వానికి నివేదించాలని అధికారులకు సూచించారు. దెబ్బతిన్న మొక్కజొన్న, వరి, సోయాపంటకు ఎకరానికి రూ.25వేలు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేల్పూర్, రామన్నపేట్ దారిలో కల్వర్టు దెబ్బతిన్నదన్నారు. మోతె, వేల్పూర్ మధ్యలో ఉన్న రోడ్డు కల్వర్టు పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, నిర్మాణానికి అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించాలని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలి

భీమ్‌గల్: భారీవర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులను వెంటనే చేపట్టి ప్రజలకు రవాణా సౌకర్యాన్ని అనువుగా చేయాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కప్పల వాగు వద్ద కోతకుగురైన రోడ్డును, నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం దెబ్బతిన్న రోడ్లను అంచనావేసి పనులు త్వరితగతంగా చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యేవెంట పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు చౌటుపల్లి రవి, ఆర్మూర్ మహేష్, సుర్జిల్, కార్యకర్తలున్నారు.



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్

వరదలో చిక్కిన పూజారి కుటుంబం

» ఎనిమిది మందిని కాపాడిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

నవీపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వరద ప్రవాహంలో చిక్కుకున్న తుంగిని హనుమాన్ ఆలయ పూజారి బంటి ధర్మపాల్ పాండేతో పాటు మరో ఏడుగురు ఇతర కుటుంబ సభ్యులను శుక్రవారంరాత్రి అధికారులు కాపాడారు. నవీపేట మండలంలోని తుంగిని ఆలయ పూజారి తన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో ఉన్న గదిలో నివసిస్తున్నారు. గురువారం అర్ధరాత్రి గోదావరిలో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. ఆలయ పరిసర ప్రాంతాల చుట్టూ వరద చేరింది. దీంతో ఆందోళన చెందిన గ్రామస్థులు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, తహసీల్దార్ వెంకటరమణ, ఎస్సైలు తిరుపతి, యాదగిరిగౌడ్‌లు ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని పిలిపించారు. బోర్టు సహాయంతో సిబ్బంది ఆలయ ప్రాంతానికి వెళ్లి పూజారి కుటుంబ సభ్యులను వెనక్కి తీసుకువచ్చారు. పూజారి కుటుంబ సభ్యులు క్షేమంగా గ్రామానికి చేరుకోవడంతో అధికారులు, గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు.

వరద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ 8

గోదావరి పరివాహక ప్రాంత
ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- పోలీస్ కమిషనర్ సాయిచైతన్య
- కందకుర్తి, తాడ్‌బిలోలిలో వరద నీటిని పరిశీలించిన సీపీ



కందకుర్తిలో అధికారులతో మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

రెంజల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్‌కమిషనర్ సాయిచైతన్య అన్నారు. గతరెండురోజులుగా భారీగా కురుస్తున్న వర్షాలకు నిజాంసాగర్‌తోపాటు మహారాష్ట్రలో కురుస్తున్న భారీవర్షాలకు గోదావరి ప్రాంతం భారీగా వరద నీటితో ప్రవహిస్తోందని, కందకుర్తి గోదావరి బ్రిడ్జి పుష్కర ఘాట్‌లు పూర్తిగా మునిగిపోవడంతో శుక్రవారం సీపీ వరద ప్రాంతాలైన కందకుర్తి, తాడ్‌బిలోలిలో ఆయన పర్యటించారు. కందకుర్తిలోగల ఎగువన నిజాంసాగర్, మహరాష్ట నుంచి గోదావరికి భారీగా వరద రావడంతో కందకుర్తి చుట్టు పక్కల ప్రాంతా లు ముంపుకు గురయ్యాయి. తాడ్‌బిలోలి నుంచి బైంసా వెళ్లే రోడ్డు పూర్తిగా జలమయమవ్వడంతో రాకపోకలు స్తంభించాయి. బోర్గాం, తాడ్‌బిలోలి వెళ్లే రోడ్డుతోపాటు తాడ్‌బిలోలి, బైంసా వెళ్లే రోడ్డు పూర్తిగా జలమయం (మిగతా 8వ పేజీలో..)

నగరంలో మున్సిపల్ కమిషనర్ పర్యటన



డ్రైనేజీలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్


సుభాష్‌నగర్, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ శుక్రవారం ఉదయం నుంచి నగరంలో విస్తృతంగా పర్యటించారు. నగరంలోని పలు కాలనీలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ముఖ్యంగా నగరంలోని పూలాంగ్ పరివాహక ప్రాంతాలను పరిశీలించి వరద ఉధృతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. నగరంలో పలు ప్రాంతాల్లో వరదనీరు చేరడంతో కాలనీలను పరిశీలించి నీరు నిలువ ఉండకుండా ఉండేలా శానిటేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి నగరంలోని గూపన్‌పల్లి, గంగాస్థాన్‌లోగల పునరావాస కేంద్రాలను సందర్శించారు. అక్కడ ఉంటున్న వారికి ధైర్యం చెప్పారు. వరద తగ్గేంతవరకు పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ రవిబాబు, టీపీవో శ్రీనివాస్, సానిటరి సూపర్‌వైజర్ సాజిద్‌అలీ, నసీర్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో కుక్కల బెడద

- పిల్లలపై తరుచూ దాడులు
- భయాందోళనలో చిన్నారుల తల్లిదండ్రులు

7

నిండిన చెరువులు





తెగిన చెక్‌డ్యాం

సిరికొండ, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడ్కోల్ గ్రామ పరిధిలోని కప్పల వాగులో సుమారు ఐదేళ్ల క్రితం నిర్మించిన చెక్‌డ్యాం శుక్రవారం తెగిపోయింది. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు వరద ఉధృతి పెరిగింది. దీంతో శుక్రవారం ఉదయం చెక్‌డ్యాం తెగిపోయింది. దీంతో నీరంతా వాగులకు వెళ్లాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చెక్‌డ్యాం మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

తెగిన కర్కవాణి కుంట

మైలారం గ్రామశివారులో గల కర్కవాణి కుంట శుక్రవారం ఉదయం వరద ప్రవాహానికి తెగిపోయింది. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి దోన్ల వాగు పొంగి ప్రవహించడం వల్ల కర్కవాణి కుంటలోకి వరద నీళ్లు వెళ్లడంతో కుంట తెగిపోయింది.

వరద ప్రభావిత ప్రాంతాల్లో
సహాయక చర్యలు

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి
- జల దిగ్బంధంలో చిక్కుకున్న గ్రామాల పరిశీలన



వ్యవసాయ శాఖ అధికారితో మాట్లాడుతున్న కలెక్టర్

బోధన్/సాలూర, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో వరద తాకిడికిగురైన ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేశామని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి వెల్లడించారు. శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ కారణంగా జలదిగ్బంధంలో చిక్కుకున్న కొప్పర్గ, హంగర్గ, సాలూర, ఖాజాపూర్ గ్రామాలను శుక్రవారం కలెక్టర్ సందర్శించారు. వరద తీవ్రతను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు కీలక ఆదేశాలను జారీ చేశారు. ముంపునకు గురైన గ్రామాల ప్రజలను బోట్లులు, ట్రాక్టర్‌లు, జేసీబీల సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న తీరును పరిశీలించిన కలెక్టర్ ఎక్కడ కూడా ప్రాణనష్టం వంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పునరావాస శిబిరాలలో ఆశ్రయం ఉంటున్న వారికి భోజనం, మంచినీరు వంటి సదుపాయాలు కల్పించాలని ముంపు గ్రామాలలో ఎవరూ కూడా చిక్కుబడి పోకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో అధికారులు, సిబ్బంది అందరు వరద బాధితులకు సహాయంగా నిలుస్తూ వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించాలని, ప్రభుత్వ యంత్రాంగం వారి వెంటే ఉందన్న భరోసా కల్పించాలని హితవు పలికారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ కారణంగా ముంపునకు గురైన వరి, సోయా, పత్తి, కంది, తదితర పంటలను కలెక్టర్ పరిశీలించారు. వరద నీటి ఉధృతి తగ్గిన వెంటనే క్షేత్రస్థాయిలో సర్వే జరిపించి పంట నష్టం అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపుతామని బాధిత రైతులకు తెలిపారు. ప్రస్తుతం ప్రాణనష్టం, ఆస్తినష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటూ వరద బాధితులకు సహాయక చర్యలు కొనసాగించడంపై దృష్టి కేంద్రీకరించామన్నారు. శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ కారణంగా ఆయా గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయ్యాయని (మిగతా 8వ పేజీలో..)

పంట పొలాలు, రోడ్ల పరిశీలన

వర్ని, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా వర్ని మండలంలో దెబ్బతిన్న పంట పొలాలు, రోడ్లను శుక్రవారం డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి పరిశీలించారు. వకీల్ ఫారం, శ్రీనగర్, జాకొర, కూనిపూర్, శంకోరా గ్రామాల్లో పర్యటించి రైతులకు భరోసా ఇచ్చారు. బాధితులకు అండగా ఉంటామని, రోడ్ల మరమ్మత్తు కు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు నామాల సాయిబాబా, కృష్ణా రెడ్డి, శ్రీనగర్ రాజు, నేమాని వీర్రాజు, రాజిరెడ్డి, వెలగ పూడి గోపాల్, గిరి తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలు పరిశీలించిన మానాల



రోడ్లను పరిశీలిస్తున్న మానాల మోహన్‌రెడ్డి

ఏర్గట్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భారీగా కురిసన వర్షాలకు బట్టాపూర్‌లోని పెద్దవాగు ఉధృతంగా ప్రవహించడంతో దెబ్బతిన్న రైతుల పంటలను శుక్రవారం రాష్ట్ర కోఆపరేటీవ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి పరిశీ లించారు. జరిగిన నష్టంపై రైతులను వివరాలు అడిగి తెలుసుకొని నష్ట పోయిన రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆడెం గంగాప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోమ దేవ రెడ్డి, బాలె శ్రీనివాస్, రైతులు పాల్గొ న్నారు.

వేల్పూర్ : రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పలు రోడ్లను, పంటలను శుక్రవారం రాష్ట్ర కో-ఆపరేటీవ్ యూనియన్ ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పరిశీలించారు. రామన్నపేట్, వేల్పూర్ గ్రామాల మధ్య రోడ్డు పూర్తిగా తెగిపోయిన రోడ్డును ఆయన పరిశీలించారు. రోడ్లను, నష్టపోయిన పంటను మోహన్‌రెడ్డి ఫోటోస్ తీసుకుని నష్టానికి సంబందించి అంచనాలు ఉన్నతాధికారులకు నివేధించాలని అక్కడ ఉన్న అధికారులకు సూచించారు.

భీమ్‌గల్ : రెండు రోజులు కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్ల పనులకు ప్రణాళికలు సిద్దం చేసి పనులను వెంటనే చేపట్టాలని రాష్ట్ర కో-ఆపరేటీవ్ యూనియన్ ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి ఆర్అండ్‌బీ అధికిఅరులకు సూచించారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని కప్పల వాగు వద్ద వర్షం వల్ల కోతకు గురైన రోడ్డును, వంతెనను, నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈయన వెంట పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు స్వామి, నర్సయ్య, ఎస్సీసెల్ అధ్యక్షుడు పర్స అనంతరావు, నాయకులు కుంట రమేష్, కన్నె సురేందర్, మల్లే లక్ష్మణ్, గోపాల్ నాయక్, నాగేంద్ర, పార్టీ కార్యం

సుంకిని గ్రామంలోకి చేరిన వరద

కోటగిరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు ఇళ్లలోకి చేరింది. పోతంగల్ మండలంలోని సుంకిని గ్రామంలో మంజీర నది ఒడ్డున ఉండడంతో వరద ఉధృతికి గ్రామంలోని పలు ఇళ్ల వద్దకు వరద నీరు చేరుకోవడంతో గ్రామస్థులు ఆందోళన చెందారు. మంజీర నదికి సమీపంలో ఉన్న ఇళ్ల ముందు భాగంలో వరద నీరు చేరుకోవడంతో అధికారులు ఇళ్లలో ఉన్న వారిని పునరావాస కేంద్రానికి తరలించారు. మధ్యాహ్నం నుంచి వరద ఉధృతి తగ్గడంతో గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు. గత 42ఏళ్ల క్రితం తమ గ్రామానికి వచ్చిన వరద మరోమారు రావడంతో గ్రామస్థులు ఆందోళన చెందారు. భారీ వర్షానికి మంజీర నది పరివాహక ప్రాంతాలలో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది, రహదారులు అధ్వానంగా మారాయి.

వరద ప్రాంతాలు పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



యంచలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ అంకిత్



మిట్టాపూర్‌లో చేరిన వరద నీరు

నవీపేట,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టాపూర్, యంచ, అల్జాపూర్, కోస్లీ, బినోలలోని వరద ప్రాంతాలను శుక్రవారం అడిషనల్ కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. ఈ సందర్భంగా యంచ, అల్జాపూర్ గ్రామాల మధ్యన వరద నీటితో మూసుకుపోయిన రహదారిని ఆయన పరిశీలించారు. గోదావరి సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆయా గ్రామాల ప్రజలకు సూచించారు. వరద పరిస్థితిపై అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్, తహసీల్దార్ వెంకట రమణ, ఎంపీడీవో నాగనాథ్, ఎంపీడీవో రామకృష్ణ, ఏవో నవీన్ కుమార్, ఇరిగేషన్ ఏఈలు శ్రీధర్, ప్రణయ్ రెడ్డిలు ఉన్నారు.

జలదిగ్బంధంలో మిట్టాపూర్..

నవీపేట : మండలంలోని మిట్టాపూర్, యంచ పంచాయతీ పరిధిలోని అల్జాపూర్‌లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉగ్రరూపం దాల్చగా పరివాహక గ్రామాలైన మిట్టాపూర్, అల్జాపూర్‌లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో ఆయా గ్రామాలకు ఇతర గ్రామాల నుండి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మండలంలోని బినోల నుండి నిజాంపూర్ వెళ్లే రహదారిపై సైతం వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. యంచలోని జగదాద్రి ఆలయం వరకు వరద నీరు చేరింది. వరదల ప్రభావంతో మండలంలోని వివిధ గ్రామాలలో సుమారు 4500 ఎకరాల వరిపంట నీట మునిగిందని అధికారులు పేర్కొన్నారు.

కమ్మర్‌పల్లి : (ఆంధ్రజ్యోతి) గత రెండు రోజుల పాటు కురిసిన బారీ వర్షాలకు రాజన్న సిరిసిల్లా జిల్లా రుద్రంగి మండలం బాల్కొండ నియోజకవర్గం పరిదిలోని మానాల గ్రామ సమీపంలోగల తాతమ్మ ఒర్రె పొంగి పోర్లుతుంది. గత ఏడాది భరీ వర్షాలు కురవడంతో శక్రవారం గుట్టలపై నుండి వచ్చిన వరద కారణంగా లోలెవల్ కాజ్‌వై పైనుండి ప్రవహిస్తున్నాయి. తగరెదు సంవత్సరాల క్రితం తాతమ్మ ఒర్రె లోలెల్ కాజ్‌వే పైనుండి వరద నీరు ప్రవహించడంతో రోడ్డు కొట్టుకు పోయి వారం రోజుల పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అయితే తాత్కలికల మరమ్మత్తులు చేపట్టిన అధికారులు రాకపోకలను పునరుద్దరించారు. అయితే తగ రెండు రోజులపాటు కురిసిన భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురై గ్రామస్తులు మళ్లి అదే పరిస్థితులను ఎదుర్కొనాల్సి వస్తుంది. అధికారులు ట్రాకర్ అడ్డంగా పెట్టి రాకపోకలను నిలిపివేశారు ఈ రహదారి మీదుగానే గైదిగుట్ట తాండా గ్రామంమీదుగా మండలకేంద్రమైన రుద్రంగి, కోరుట్ల, పవిత్ర పుణ్యక్షేత్రం వేములవాడ జిల్లా కేంద్రమైన సిరిసిల్లాకు వెల్లాల్సి ఉంటుంది. ప్రతీ వర్షాకాలం అదేపరిస్థితిని ఎదుర్కుటున్నామని గ్రామస్తులు వాపోతున్నారు.

జక్రాన్‌పల్లి : మండలంలో కురిసిన భారీ వర్షాలకు గ్రామాల్లో చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. రామడుగు ప్రాజెక్టు అలుగు పారుతుంది. దీంతో కలిగోట్, చింతలూర్ వాగులో చెక్‌డ్యాం ఉధృతంగా పారుతుంది. చింతలూరు వైపు చెక్‌డ్యాం పక్కన మట్టికట్ట కోతకు గురైంది. ఈ చెక్‌డ్యాం నుంచి వేల్పూర్ మండల పచ్చల నడ్కుడ చెరువుకు వెళ్లే మాటు కాలువ తూము షేటారు కొట్టుకుపోయింది. శుక్రవారం ఇరిగేషన్ ఎస్ఈ రామరావు, ఇరిగేషన్ క్వాలిటి ఈఈ దత్తాద్రి, పంచాయితీ కార్యదర్శులు అధికారులు కలిసి చింతలూర్ చెక్‌డ్యాం వైపు మట్టికట్ట కోతకు గురికాగా వారు పరిశీలించారు. మండలంలోని పడకల్, కేశ్‌పల్లి పెద్ద చెరువు అలుగు పారుతుంది. అర్గుల్ పలు చెరువు అలుగు పారుతుంది.

ఏర్గట్ల : భారీగా కురుస్తున్న వర్షాలకు గోధావరి తీర ప్రాంతాల్లోని పంట పోలాలు పూర్తి నీటితో నిండిపోయాయి. వ్యవసాయాశాఖ అధికారులు మండలంలోని గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి దాదాపు 660 ఎకరాల పంట నీటి మునిగి పాడాయ్యాయని అంచానా వేశారు. పంట నష్టం వివరాలను పై అధికారులకు పంపిస్తామని మండల వ్యవసాయశాఖ అధికారి వైష్ణవ్ తెలిపారు. అలాగే గోధావరి తీర ప్రాంతమైన తడపాకల్‌ను ఆర్మూర్ సబ్ కలేక్టర్ అభిఘ్నాన్ మాల్వియా పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు.



భారీ వర్షాలకు పొంగి పొర్లుతున్న మానాల తాతమ్మ ఒర్రె



తడపాకల్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఆర్మూర్ సబ్ కలెక్టర్

భారీ వాహనాల రోడ్ల మళ్లింపు



పెర్కిట్ చౌరస్తా వద్ద వాహనాలను మళ్లిస్తున్న పోలీసులు

ఆర్మూర్ టౌన్ , ఆగస్టు 3, (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ చౌరస్తా వద్ద స్థానిక పోలీస్‌లు భారీ వాహనాల రోడ్ల మళ్లింపును చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కామారెడ్డి ప్రాంతంలో రోడ్లు పూర్తిగా ధ్వసం కావడంతో ఆర్మూర్ మీదుగాహైదరాబాద్ వెళ్తున్న భారీ వాహనాలను మెట్‌పల్లి, కోరుట్ల, కరీంనగర్ మీదుగా హైదరాబాద్‌కు తరలించారు.

మండల పరిషత్ కార్యాలయం తనిఖీ

కమ్మర్‌పల్లి, ఆగస్టు 29: (ఆంధ్రజ్యోతి) కమ్మర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సాయన్న ఆకస్మిక తనికి చేశారు. ఈసందర్బంగా మండలంలోని మండల ప్రాదేశిక (ఎంసపీటీసీల) సభ్యుల ఆన్‌లైన్ మ్యాపింగ్ పనులను ఆయన కంప్యూటర్‌లో స్వయంగ పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం మండలంలోని వార్డులవారిగా ఓటర్ల పేర్లను చేర్చిన వివరాలను, పోలింగ్ బూత్‌ల వివరాలను స్థానిక ఎంపీడీవో రాజా శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. మండల పంచాయితీ అధికారి సదాశివ్, మండలసీనియర్ అసిస్టేంట్‌లు అమృత్ రావు, శివకుమార్ టైపిస్టు సంతోష్ కుమార్ ఉన్నారు.

పొంగి పొర్లుతున్న చెక్‌డ్యాంలు

వేల్పూర్, ఆగస్టు 3, (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెద్దవాగు, కప్పల వాగులపై నిర్మించిన చెక్‌డ్యాంలు వరద నీటితో పొంగి ప్రవహిస్తున్నాయి. పెద్దవాగులో జాన్కంపేట్ గ్రామ సమీపంలోని బీరప్పా ఆలయం వద్ద, పచ్చల నడ్కుడ బ్రిడ్జి సమీపంలో, వేల్పూర్ బ్రిడ్జి సమీపంలో అలాగే మోతె గ్రామ కప్పల వాగు బ్రిడ్జి సమీపంలో నిర్మించిన చెక్‌డ్యాంలు పూర్తిస్థాయిలో పొంగి ప్రవహిస్తున్నాయి.

కోతకు గురైన రోడ్లు



వర్షాలకు పాడైనపోయిన రుద్రూరు రోడ్డు

రుద్రూరు,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు కోతకు గురయ్యాయి. రోడ్లు ధ్వంసం అవుతుండడంతో ప్రయాణం సాగించే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లకు మరమ్మత్తులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్ల పరిశీలన

వర్ని, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా వర్ని మండలంలో దెబ్బతిన్న పంట పొలాలు, రోడ్లను శుక్రవారం డిసిసిబి మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పరిశీలించారు. వకీల్ ఫారం, శ్రీనగర్, జాకొర, కూనిపూర్, శంకోరా గ్రామాల్లో పర్యటించి రైతులకు భరోసా ఇచ్చారు. బాధితులకు అండగా ఉంటామని, రోడ్ల మరమ్మత్తు కు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు నామాల సాయిబాబా, కృష్ణా రెడ్డి, శ్రీనగర్ రాజు, నేమాని వీర్రాజు, రాజిరెడ్డి, వెలగ పూడి గోపాల్, గిరి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బియ్యం పంపిణీ

కోటగిరి,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని సుంకిని గ్రామంలో వరద బాధిత కుటుంబాలకు శుక్రవారం బీజేపీ నాయకులు, ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ బియ్యం బస్తాలను పంపిణీ చేశారు. సుంకిని గ్రామంలో వరద ప్రవాహంలో దెబ్బతిన్న పంట పొలాలను, నీట మునిగిన కాలనీల్లో ఆయన పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకునేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆయన వెంట పోతంగల్ మండల బీజేపీ నాయకులున్నారు.

కోతకు గురైన నాళేశ్వర్, తల్వేద బ్రిడ్జి

నవీపేట,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్, నందిపేట మండలం తల్వేద గ్రామాల మధ్యన ఉన్న బ్రిడ్జి కోతకు గురైంది. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పెద్ద ఎత్తున నీటి ప్రవాహం పెరగడంతో నాళేశ్వర్ వైపున ఉన్న బ్రిడ్జి పక్క భాగం కోతకు గురైంది. కోతకు గురైన బ్రిడ్జి భాగాన్ని వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని గ్రామానికి చెందిన పలువురు నాయకులు అధికారులను కోరారు. భారీ వర్షాలకు నీటి ప్రవాహం పెరగడంతో గ్రామ శివారులో ఉన్న వరిపంట నీట మునిగింది.

పోతంగల్‌లో 2,400 ఎకరాల్లో పంట నష్టం

కోటగిరి,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 2,400 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయ అధికారిణి నిశిత తెలిపారు. పోతంగల్ మండలంలోని సోంపూర్, హుమ్నాపూర్, కారేగాం, హంగర్ల, సుంకిని, పోతంగల్ గ్రామాలలో దెబ్బతిన్న పంటలను శుక్రవారం వ్యవసాయ అధికారిణి పరిశీలించారు. పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. ఆమె వెంట ఏఈవో సుప్రియ, రైతులు తదితరులు ఉన్నారు.

పొలాల పరిశీలన

సాలూర,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): సాలూర మండలంలోని మంజీర పరివాహక ప్రాంతాలలో ఉన్నటువంటి వరదలకు ముంపునకు గురైన పంట పొలాలను సాలూర వ్యవసాయ అధికారి శ్వేత, ఎంపీడీవో శ్రీనివాస్‌లు పరిశీలించారు. గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు హున్స, మందర్నా, ఖాజాపూర్ గ్రామాలలో పంట నష్టం అధికంగా వాటిల్లినట్లు వారు పేర్కొన్నారు. పంట నష్ట వివరాలను అంచన వేస్తున్నామన్నారు. సోయాపంట 2820 ఎకరాలు, వరిపంట 3110 ఎకరాలు వరకు నష్టం వాటిల్లినట్లు అంచన వేశామన్నారు. అంచన వేసిన పంట నష్ట వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వం నిర్ణయం మేరకు రైతులకు పంట నష్టపరిహారం అందించడం జరుగుతుందని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.

తాడ్‌బిలోలి, బోర్గాం మధ్య నిలిచిన రాకపోకలు

రెంజల్,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): గత రెండు, మూడు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు తాడ్‌బిలోలి, బోర్గాం మధ్య రోడ్లపై రాకపోకలు నిలిచిపోయాయి,. ఎన్‌హెచ్ 161బీబీ పూర్తిగా నీట మునిగిపోవడంతో బైంసా నుండి బోధన్ వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. బోర్గాం నుండి తాడ్‌బిలోలి వెళ్లే రోడ్డు అధిక నీటి ప్రవాహంతో రాకపోకలు స్తంభించాయి. ఇటువైపుగా ప్రజలు రాకూడదని అధికారులు వాహనాలను దారి మళ్లించారు. అధిక నీటి ప్రవాహం ఎక్కువ అవ్వడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎస్ఐ చంద్రమోహన్‌లు బారికేడ్లను ఏర్పాటు చేసి వాహనాలను దారి మళ్లించారు. ఏమైన సమస్యలుంటే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.



నిలిచిన రాకపోకలు

క్రైం సమాచారం

కెనాల్‌లో పడి వ్యక్తి మృతి

సుభాష్‌నగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నిజాంసాగర్ కెనాల్‌లో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. 6వ టౌన్ ఎస్‌హెచ్‌వో వెంకట్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. నగర శివారులోని డెయిరీ ఫామ్ కమాన్ వద్ద ఉన్న నిజాంసాగర్ కెనాల్‌లో శుక్రవారం గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. కాలువలో పడి మృతిచెందిన వ్యక్తికి సుమారు 40 ఏళ్లు ఉంటాయని, ఆనవాళ్లు లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా మృతుడి సమాచారం తెలిస్తే 6వ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

మోర్తాడ్, ఆగస్టు 3, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భగత్‌సింగ్ కాలనీలో చోరీ చేసిన నిందితుడిని ఆరెస్టు చేశామని సీఐ సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రంలో భగత్‌సింగ్ కాలనీకి చెందిన అమృతరావు ఇంట్లో నాలుగురోజుల క్రితం గుర్తుతెలియని దొంగలు తాళం తీసి ఇంట్లోకి ప్రవేశించి 9 మాసాల బంగారాం, ఐదువేల రూపాయలు దొంగిలించారని సీఐ తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశామని శుక్రవారం మోర్తాడ్‌కు చెందిన ఎర్ర అశోక్ ను ఆరెస్టు చేసి దొంగిలించిన బంగారంను రికవరీ చేసి జైలుకు పంపామని తెలిపారు. సమావేశంలో మోర్తాడ్ ఎస్సై రాము, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో యువకుడికి గాయాలు

ఎడపల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):మండలంలోని సాటాపూర్ గేటు సమీపంలో బోధన్-నిజామాబాద్ ప్రదాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో బోధన్ పట్టణానికి చెందిన షేక్ అన్సార్ అనే యువకుడికి గాయాలు అయినట్టు ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం బోధన్ పట్టణానికి చెందిన షేక్ అన్సార్ అనే యువకుడు తన ద్విచక్రవాహనంపై నిజామాబాద్ వెలుతుండగా సాటాపూర్ గేటు వద్ద డివైడర్‌ను ఢీ కొట్టడంతో అతనికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కోస్లీలో కోళ్ల మృతి

నవీపేట,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీ శివారులో గురువారం రాత్రి కోళ్ల ఫారం వరద నీటిలో మునిగిపోయింది. గ్రామానికి చెందిన హరీష్ కుమార్ కోళ్ల ఫారంలో సుమారు 9వేల వరకు కోళ్లు ఉన్నాయి. అర్ధరాత్రి సమయంలో ఆకస్మాత్తుగా వరదలు రావడంతో కోళ్ల ఫారం పూర్తిగా నీట మునిగింది. కోళ్ల ఫారంలో ఉన్న 9వేల కోళ్లు మృతి చెందాయని దీంతో సుమారు 15లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు హరీష్ కుమార్ పేర్కొన్నాడు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సాలూర,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): సాలూర శివారులోని మంజీర ఒడ్డుపై ఉన్న పిల్ల కాలువలో శుక్రవారం మృతదేహం లభ్యమైనట్లు బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పరిశీలించారు. శవ పంచనామా నిర్వహించారు. విచారణ అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపారు.

విద్యుత్‌షాకుతో రెండు గేదెలు మృతి

మెండోర , ఆగస్టు 3, (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోన్‌పేట్ గ్రామానికి చెందిన రైతుల రెండు గేదెలు విద్యుత్ షాక్‌తో మృతిచెందినట్లు ట్రాన్స్‌కో ఏఈ అజ్మద్ పాషా తెలిపారు. ఈ సందర్భంగా సోన్‌పేట్ గ్రామానికి చెందిన దంతే లక్ష్మీ, ధోని లత రైతులకు చెందిన రెండు గేదెలు అమ్రాయి కాలనీలో విద్యుత్ షాక్‌తో మృతి చెందాయని సుమారు గేదెల ఖరీదు లక్ష రూపాయల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

కంజర్‌లో యువతి ఆత్మహత్య

మోపాల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కంజర్ గ్రామానికి చెందిన అక్షయ (20) అనే యువతి శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ సుష్మిత సంఘటన స్థలనికి చేరుకుని యువతి ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. యువతి నిజామాబాద్‌లో నర్సింగ్ కోర్సు చదువుతుంది. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. యువతి తల్లి ఇటీ వలే మరణించింది. ఆమె అమ్మమ్మ దగ్గర ఉంటుంది. ఇంట్లో ఎవరు లేని సమయంచూసి దూలానికి ఉరి వేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

గల్లంతైన బాలరాజు మృతదేహం లభ్యం

● రెండు రోజులకు దొరికిన ఆచూకీ



బాలరాజు మృతదేహాన్ని మోసుకుని వస్తున్న ఏఎస్సై, గ్రామస్థులు


దోమకొండ,(బీబీపేట) ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):దోమకొండ- సంగమేశ్వర్ గ్రామాల మధ్యలో వాగు ప్రవాహానికి కొట్టుకుపోయిన సంగమేశ్వర్ గ్రామానికి చెందిన గోత్రాల బాలరాజు(42) మృతదేహం శుక్రవారం పంటపొలాల్లో లభ్యమైంది. వరద తగ్గడంతో అటుగా వ్యవసాయబావుల వద్దకి వెళ్లిన రైతులకు కంటబడటంతో వెంటనే స్థానిక ఎస్సై ప్రవంతికి సమాచారం అందించారు. సిబ్బందితో ఆమె అక్కడకు చేరుకుని మృతదేహన్ని బయటకు తెచ్చేందుకు చాలా ఇబ్బందులు పడ్డారు. రోడ్డు నుంచి 1 కిలోమీటర్‌కు పైగా దూరం కొట్టుకుపోయిన బాలరాజు మృతదేహం రోడ్డుకు తీసుకురావడానికి ఏఎస్సై జానీపాషా మరో ముగ్గరు గ్రామస్తులతో కలసి అతికష్టం మోసుకుంటూ రోడ్డుకు తెచ్చారు. అనంతరం మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రి కామారెడ్డికి తరలించారు. మృతునికి భార్య రూప, ఇద్దరు పిల్లలు రుత్విక్(17) సాకేత్(09) ఉన్నారు. తహసీల్దార్ సుధాకర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

● రైతులను కంటతడి పెట్టించిన భారీ వర్షం

మండలంలోని సంగమేశ్వర్, గొట్టిముక్కుల,అంచనూర్, దోమకొండ, బీబీపేట మండలంలోని మాందాపూర్, జనగామ, బీబీపేట, ఉప్పర్‌పల్లితో పాటు ఆయా గ్రామాల్లో వందల ఏకరాల్లో పంటలు వరద దాటికి పూర్తిగ కొట్టుకుపోయింది. దీంతో రైతులు కంటతడి పెట్టుకున్నారు. చేతికి వస్తుందన్న పంటలు రాత్రికిరాత్రే నేలమట్టం కావడంతో రైతులు దిగులు చెందుతున్నారు. ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని దోమకొండ, బీబీపేట మండలాలు రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి


● మన్నే పోచయ్య రైతు



సంగమేశ్వర్ రోడ్డులో నా వ్యవసాయ పొలం వద్ద రేకుల షెడ్డు వేసి అందులో ఆవులను పెంచుతున్నాను. భారీ వర్షం కురియడం తో షెడ్డుతో పాటు అందులో కట్టివేసిన 8 ఆవులు కొట్టుకుపోయి మృతి చెందాయి. దీంతో రూ.6 లక్షల వరకు నష్టం జరిగింది. నన్ను ప్రభుత్వం ఆదుకోవాలి.

వరి పంట మొత్తం నేలమట్టం అయింది

● నత్తి నవీన్, రైతు గొట్టిముక్కుల



ఎడ్ల కట్ట వాగు ప్రవహం వలన మూడు ఎకరాల్లో వరి పంట నేల మట్టం అయింది. లక్ష్మీదేవునిపల్లి గ్రామ శివారులో కౌలుకు తీసుకుని చేస్తున్న పంట పూర్తిగా దెబ్బతింది. పెట్టుబడి పెట్టి పంట ఒక దశకు వచ్చే స్థాయికివాగులో కొట్టుకుపోయింది. అధికారులు సర్వే నిర్వహించి మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

ఇంతటి స్థాయిలో ఎపుడు చూడని వాగు

● శ్యాంరెడ్డి, రైతు



గత 100 సంవత్సరాల నుంచి కూడా ఇంతటి వాగు ఉధృతి రాలేదని గ్రామ పెద్దలు చెపుతున్నారు. ఇంతటి ప్రవహాన్ని ఎపుడు చూడలేదు. బిక్కనూర్, లక్ష్మాపూర్, దంతేపల్లి మీదుగా భారీ వర్షం కురియడం వలన గొట్టిముక్కుల, సంగమేశ్వర్, మాందాపూర్, బీబీపేటకు పెద్ద ఎత్తున వాగు పారింది. దీంతో రోడ్లు తేగిపోయాయి. పంటలు నీటికి కొట్టుకుపోయాయి.

రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి

కోటగిరి,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలకు పంట పరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. పోతంగల్ మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముందు మండలంలోని సుంకిని, పోతంగల్, కారేగాం గ్రామాలలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. సుంకినిలో మంజీర వరద నీరు గ్రామాల్లోకి చేరడంతో గ్రామస్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ రావు, కిషన్, రవి, నవీన్, అఖిం, శ్రీనివాస్ గౌడ్, సంతోష్, నజీర్, యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

రెంజల్,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుంచి అధికంగా కురుస్తున్న వర్షాలకు గోదావరి ప్రాంత ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు నీట మునిగి తీవ్ర నష్టం జరిగిందని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్ రెడ్డి, మేడపాటి ప్రకాష్ రెడ్డిలు అన్నారు. శుక్రవారం మండలంలోని నీలా, కందకుర్తి గ్రామాలలో నీట మునిగిన పంటలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంటలు పూర్తిగా జలమయమవ్వడంతో రైతులకు నష్టాన్ని మిగిల్చాయని, నష్టపోయిన రైతులకు ఎకరాకు 30వేల నష్ట పరిహారం అందించి, రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు యోగేష్, మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు మేక సంతోష్, ప్రసాద్ బాబు, యోగేష్, రమేష్, శ్రీను, శివ, కూరెళ్ల శ్రీధర్, అంతయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీ.మోహన్ రెడ్డి శుక్రవారం మండలంలోని కోస్లీ, యంచ, నందిగామ గ్రామాలలో నీట మునిగిన పంట పొలాలతో పాటు వరద ప్రాంతాలను సందర్శించారు. వరదల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తగిన పరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో శైలేష్ కుమార్, రమణ రావు, భూషణ్, రాజేందర్ గౌడ్, నాగభూషణ్, సందీప్, రాము, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతులకు తప్పని ఇబ్బందులు

జక్రాన్‌పల్లి, ఆగస్టు 3, (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కోసం రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. యూరియా దొరకకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం మండలంలోని పడకల్ గ్రామంలో ఎరువుల గోదాం వద్ద యూరియా కోసం రైతులు తమ వెంట తెచ్చుకున్న ఆధార్, పాస్‌బుక్ జిరాక్స్‌లను క్యూలో పెట్టారు. వర్షాలు కురుస్తునందున పంట పొలాలకు యూరియా అవసరం ఉందని రైతులు తెలిపారు. ప్రస్తుతం వరి పంటకు యూరియా అవసరం ఉందని రైతులకు సరిపడా యూరియా దొరకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబందిత అధికారులు స్పందించి రైతులు ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని సకాలంలో యూరియా అందించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

తడి పొడి చెత్తపై అవగాహన



మహిళలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

ఆర్మూర్ టౌన్ , ఆగస్టు 3, (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని 28, 32 వ వార్డులలో మున్సిపల్ అధికారులు తడి పొడి చెత్తపై మహిళలకు అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరుగుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వాడవద్దని సీజనల్ వ్యాధులపట్ల, వీధి కుక్కల పట్ల జాగ్రత్తలు వహించాలని సూచించారు. కార్యక్రమంలో సానిటరి ఇన్‌స్పెక్టర్ నరేందర్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, రాజేశ్, నీలిమ పాల్గొన్నారు.

మూడు గ్రామాలలో డ్రై డే

వేల్పూర్, ఆగస్టు 3, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోతె, రామన్నపేట్, పచ్చల నడ్కుడ గ్రామాలలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగానే సానిటేషన్ పనులను చేపట్టి మురికి కాలువలను శుభ్రం చేస్తు బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ, మురికి నీరు నిల్వకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు.



మాసాని చెరువు గేట్లపై నుంచి వస్తున్న నీరు

నిండిన చెరువులు

మోపాల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో చెరువులు నిండుకుండల్లాగా నిండాయి. ఇటీవల కురిసిన వర్షాలతో మండలంలోని మంచిప్ప, కులాస్‌పూర్, కొండెం చెరువు, మాసాని చెరువు, ఖజానా చెరువులు నిండు కుండల్లాగా నిండాయి. ఎన్నో సంత్సరాల తర్వాత ఈ చెరువుల ఇంత పెద్ద ఎత్తున నిండటం ఇదే తొలిసారి అని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు తెలిపారు. మండలంలోని న్యాల్‌కల్ గ్రామంలో ఉన్న మాసాని చెరువు నిండి గేట్లపై నుం చి పారుతుంది. వీటిని కూడటానికి గ్రామస్థులే కాకుండా నగర ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్తున్నారు. చెరువుల పరిస్థితులను ఎప్పటికప్పుడు ఇరిగేషన్ అధికారులు తెలుసుకుంటున్నారు.

పునరావాస కేంద్రంలో దుప్పట్ల పంపిణీ

నిజాంసాగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలం గోర్గల్ గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో శుక్రవారం పిట్లం, నిజాంసాగర్ మండలాల బీజేపీ నాయకులు మర్పల్లి గ్రామానికి చెందిన 60 మందికి దుప్పట్లను పంపిణీ చేశారు. ఎంపీ బీబీ పాటిల్ తరఫున మరింత సహాయం అందించేందుకు కృషి చేస్తామని బీజేపీ నియోజకవర్గ నాయకుడు బత్తిని జగదీష్ మధ్యలో నవీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాయి రెడ్డి, నరేష్, అశోక్‌రాజ్, రాజు, రవిచంద్ర, ఎర్ర రమేష్ రామ్ రెడ్డి పాల్గొన్నారు.



నిర్వాసితులకు దుప్పట్లు అందజేస్తున్న నాయకులు



కొనసాగుతున్న నిజాంసాగర్ వరద గేట్లు



నిజాంసాగర్ నీటిని అస్వాదిస్తున్న సందర్శకులు

నిజాంసాగర్‌కు తగ్గని వరద ఉధృతి

నిజాంసాగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్టులోనికి వరద నీరు ఉధృతంగా వస్తూనే ఉంది. మంజీరా నది వెంట వచ్చే వరద నీటిని నీటిపారుదల శాఖ అధికారులు ప్రాజెక్టు 23 వరద గేట్లను ఎత్తి శుక్రవారం నాటికి ఎగువ నుంచి వచ్చే లక్ష 67 వేల 944 క్యూసెక్కుల వరద నీటిని మంజీరా నదిలోకి వదిలి వేస్తున్నారు. మంజీరా నది పరివాహక ప్రాంతంలో ప్రాంతంలో కుడి ఎడమ పక్కన ఉన్న వరి పైర్లు వరద నీటిలో తొణికిసలాడుతున్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి మట్టం 1,405 అడుగులు కాగా, ప్రస్తుతం 1402.78 అడుగులకు చేరింది. ప్రాజెక్టు సామర్థ్యం 17.802 టీఎంసీలు కాగా, 14.697 టీఎంసీ నీరు నిల్వ ఉంది. ఈనెల 18వ తేదీ నుంచి 23 గేట్లు ఎత్తి మంజీర నదిలోకి విడుదల చేస్తున్నారు.

ఆదర్శ బాలికలు కేజీబీవీకి తరలింపు



ఆదర్శ హాస్టల్ పిల్లలను కేజీబీ తరలిస్తున్న దృశ్యం

నిజాంసాగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌లో విద్యాభ్యాసం చేస్తూ ఆదర్శ హాస్టల్లో ఉంటున్న విద్యార్థులను వర్షా భావ పరిస్థితి శుక్రవారం అధికారులు హాస్టల్ బాలికలను కస్తూర్బా విద్యాలయానికి తరలించారు. జవహర్ నవోదయ మోడల్ స్కూల్ చుట్టూ వరదనీరు ఉండడంతో మోడల్ స్కూల్ హాస్టల్‌లో విద్యుత్, తాగునీటి సరఫరా నిలిచిపోయింది. హాస్టల్ పాఠశాలకు రాకపోకలు నిలిచిపోయాయి ఐదు రోజులగా హాస్టల్ బాలికలు బిక్కుబిక్కుమంటూ హాస్టల్లోనే ఉండిపోయారు. నాలుగు రోజులుగా భారీ వర్షాలు తెలియడంతో హాస్టల్లో కరెంటు నిలిచిపోవడంతో బాలికలు ఆందోళన చెందారు. ఎట్టకేలకు విఆర్ నెంబర్ 5లోని వరద గేట్లను తగ్గించడంతో నవోదయ సమీపంలో ఉన్న చిన్న పూలు వంతెన వరద నీటిలో నుంచి తేలుకోలేకపోయింది. దీంతో అధికారులు, ప్రజాప్రతినిధులు హాస్టల్లో ఉన్న 90 మంది బాలికలు మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయానికి తరలించారు.

బాన్సువాడ డివిజన్‌లో 99 ఇళ్లు పాక్షిక నష్టం

- బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి



ఎస్‌డీఆర్ఎఫ్‌లతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

నిజాంసాగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ డివిజన్ పరిధిలోని మండలాల్లో భారీ వర్షాలు 99 ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని సబ్ కలెక్టర్ కిరణ్మయి తెలిపారు. శుక్రవారం శ్రీరాంసాగర్ ఫైసల్ కార్యాలయంలో ఎస్డిఆర్ఎఫ్ రిస్క్యూ టీం సభ్యులతో ఆమె మాట్లాడారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో నిజాంసాగర్ మండలంలో పునరావస కేంద్రానికి తరలించడం జరిగిందన్నారు. వారికి అన్ని వసతులు కల్పిస్తూ వైద్య సేవలు కూడా అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. మహమ్మద్ నగర్ మండలంలోని తుగ్గపల్లి గ్రామంలో వర్షపు నీరు రావడంతో కొన్ని కుటుంబాలను పాఠశాల ఏర్పాటుచేసి పునరావస కేంద్రానికి తరలించడం జరిగిందని ఆమె అన్నారు. ఆరేపల్లిలో ఓ కుటుంబం ఇల్లు కూలిపోవడంతో పాఠశాలల్లో వసతి కల్పించామన్నారు. జవహర్ నవోదయ ఆదర్శ పాఠశాల హాస్టల్ పిల్లలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పాఠశాలకు నిలిచిపోయిన విద్యుత్, తాగునీటి సరఫరాను చర్యలు చేపడుతున్నామని ఆమె అన్నారు. ఆదర్శ పాఠశాల బాలికలను కస్తూర్బా విద్యాలయానికి తరలించామన్నారు. హజీపూర్ చెరువు గండిపడడంతో 15 కుటుంబాలను 15 కుటుంబాలలోని 36 మందిని నెమలి పాఠశాలలో ఆశ్రమ కల్పించామని ఆమె అన్నారు. లింగంపల్లి గ్రామ వరద చుట్టుపట్టడంతో కొన్ని కుటుంబాలను పాఠశాలలో ఆశ్రయం కల్పించినట్లు ఆమె వెల్లడించారు. పురావస కేంద్రంలో ప్రజలకు అన్ని వసతులు నిజాంసాగర్ మండలంలో 51 గృహాలు పాక్షికంగా కూలినట్లు ఆమె తెలిపారు.

పొంగిపొర్లుతున్న కోనాపూర్ రాళ్లవాగు ప్రాజెక్ట్



పొంగిపొర్లుతున్న కోనాపూర్ రాళ్లవాగు ప్రాజెక్ట్



రాళ్లవాగు జలాశయం వద్దకు శుక్రవారం మధ్యాహ్నం చేరుకున్న సందర్శకులు

- రాళ్లవాగుకు సందర్శకుల తాకిడి
- సదుపాయాలు కల్పించాలని వినతి

కమ్మర్‌పల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో భారీ వర్షాలు లేక చెరువులు, కుంటలు వెలవెలబోతుండగా రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల కు పొంగిపొర్లుతున్నాయి. కొండాకోనలు, గుట్టల నుం చి జాలువారిన నీటితో ఓ వైపు గట్టు పోడిచిన వాగు నిండి పొంగిపొర్లుతుండగా బుధ,గురువారాలు ఎకధాటిగా కురిసిన సుమారు 10 సెంటిమీటర్ల (112. 2 మి.మీ) వర్షానికి మండంలోని కోనాపూర్ రాళ్లవాగు మత్తడి పోర్లుతుంది. 20 రోజులుగా అడపా దడప కురుస్తున్న ముసురువర్షాలకు కొద్దికొద్దిగా రాళ్లవాగు ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతుండగా గట్టుపోడిచిన వాగు పొంగిపొర్లడంతో పాటు రెండు రోజులు కురిసిన భారీ వార్షానికి రాళ్లవాగు ప్రాజెక్ట్ శుక్రవారం తెల్లవారుజామునుంచి మత్తడి పొంగి పొర్లింది. వరుసగా వానలు ముసరురూపంలో కురుస్తుండడంతో మండలంలోని నర్సాపూర్, ఇనాయత్‌నగర్ గ్రామాల మధ్య అటవి ప్రాంతంలో నిర్మించిన గట్టుపొడియిన వాగు గత 2 రోజులక్రితం నిండు కుండల మారి మత్తడి పై నుంచి రాళ్లవాగు ప్రాజెక్ట్ వైపు పరుగులు తీశాయి. దీనితో శుక్రవారం మండలంలోని మారుమూల గ్రామం కోనాపూర్ రాళ్లవాగు పొంగి పోర్లింది. మంగళవారం వరకు మండలంలోని దాదాపు ఏ చెరువులోను కుంటల్లో 60 శాతం కుడ నీరు చేరకపోగా గట్టుపొడిచినవాగు, రాళ్లవాగు ప్రాజెక్ట్ పొంగిపొర్లుతుండడంతో రైతుల్లో ఆనందం వేల్లువిరుస్తుంది. ఈ సారి మొన్నటివరకు అంతగా భారీ వర్షాలు లేకపోయినా చెరువుల్లోకి నీరు చేరకపోయినా గుట్టలప్రాంతంలోని రాళ్లవాగు ఉప్పొంగి ప్రవహించింది. రాళ్లవాగు పొంగడంతో రైతుల్లో ఆశాలు చిగురించాయి. ఈ ప్రాజెక్ట్ నుంచి కుడి ఎడమ కాలువల ద్వారా కోనాపూర్‌కు చెందిన 7వందల ఎకరాలకు, జగిత్యాల జిల్లా కథలాపూర్, భూషన్‌రావుపేట్, పెగ్డెర్ల, ఊట్‌పెల్లి గ్రామాలకు చెందిన సుమారు 2 వేల 8 వందల ఎకరాలకు కుడి కాలువ ద్వారా ఈ పాజెక్ట్ సాగునీరందిస్తుంది. కాగా వరుణుడు కరునించడంతో పంటలుగట్టెక్కనట్లేనని ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాళ్లవాగుకు మొదలైన సందర్శకుల తాకిడి

కొన్నేళ్లుగా ఆగస్టు మొదటివారంలోనే రాళ్లవాగు ప్రాజెక్ట్ పొంగిపోర్లుతుండేది. రెండేళ్ల క్రితం నిండు కుండలా మారిన ఈ ప్రాజెక్ట్ సుమారు మూడు నెల ల పాటు సందర్శకులతో ఈ ప్రాంతం పిక్నిక్ స్పాట్‌ను తలిపించి సుదూర ప్రాంతాల నుంచి పకృతి ప్రేమికులు రాళ్లవాగు జలాశయ అందాలను తిలకించేందుకు వరుసకట్టి పోటీపడ్డారు. సందర్శకులతాకిడి కొనసాగింది. అయితే ఈ సారి మాత్రం నెలరోజులు ఆలస్యంగానైన నిండుకుండలామారి మత్తడి పారుతుండడంతో విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు రాళ్లవాగును చేసేందుకు సందర్శకుల తాకిడి మోదలయింది. ఇదిలాఉండగా రాళ్లవాగు సందర్శన కోసం అక్కడికి వచ్చే సందర్శకుల సౌకర్యార్థం తాగునీరు, తదితర సదుపాయాలు లేవని గ్రామపంచాయతీ, గ్రామకమిటీ సభ్యులు చొరవ తీసుకుని సదుపాయాలు కల్పించాలని సందర్శకులు కోరుకుంటున్నారు.



ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారిపై కూలిన పాముల వాగు వంతెన

ప్రకృతి ప్రళయం

- లింగంపేట మండలంలో తెగిపోయిన వంతెనలు
- కొట్టుకుపోయిన పంటలు
- నిలిచిపోయిన రాకపోకలు
- సాయం కోసం ఎదురుచూపులు

లింగంపేట, అగస్ట 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఒక్క రోజులో ప్రకృతి ప్రళయం సృష్టించింది. మండలానికి ప్రధాన రహదారి ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారిపై లింగంపల్లి వద్ద పాముల వాగు వంతెన కూలిపోవడంతో కామారెడ్డికి రాకపోకలు నిలిచిపోయాయి. అడ్విలింగాల వద్ద రోడ్డు తెగిపోవడంతో ఎల్లారెడ్డికి రాకపోకలు నిలిచిపోయాయి. శెట్పల్లిసంగారెడ్డి వద్ద వంతెన కూలిపోవడంతో గోపాల్‌పేటకు వెళ్లే దారి లేకుండా పోయింది. కన్నాపూర్ వద్ద వంతెన కూలిపోవడంతో అటు రాకపోకలు నిలిచిపోయాయి. నాగారం వద్ద కాసుల కత్త వంతెన తెగిపోయి బాణాపూర్, కోర్పోల్ బాయంపల్లి గ్రామాలకు బంద్ ఏర్పడింది. ఇలా మండలానికి నాలుగు వైపులా రహదారులు తెగిపోవడంతో మండల ప్రజలు ఎక్కడి వారు అక్కడే సహయం కోసం ఎదురు చూస్తున్నారు. సహయం చేసేందుకు వచ్చేవారు సైతం రాలేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో మొత్తం 11చెరువులు కుంటలకు గండ్లు పడినట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ప్రతీ గ్రామంలో ఒకటి నుంచి మూడు నాలుగు చెరవులు ఉన్నాయి. మండలంలో అధికంగా వరి పండిస్తారు. దీంతో చెరువలకు గండ్లు పడడంతో చెరువుల్లో నీరు లేక వెల వెల పోతున్నాయి. చెరువుల్లోని మట్టి మొత్తం పంటపొలాల్లో చేరి పంటలు మట్టి, ఇసుకతో నిండి పోయాయి. మండలంలో అనేక నివాప గృహాలు కూలిపోయాయి. మండలంలోని పొల్కంపేట చౌదరి చెరువు నిండు కుండలా నిండుకున్న చెరువు వర్షానికి గండిపడి పూర్తిగా చుక్కనీరు లేకుండా ఖాళీ అయ్యింది. పొల్కంపేట, కన్నాపూర్ గ్రామాలకు 600ఎకరాలకు నీరందించే అతి పెద్ద చెరువుకు గండి పడి నీరు లేకుండా పోవడంతో గ్రామస్తులు ఆవేధన చెందుతున్నారు. చెరువులోని మట్టి పంట పొలాల్లో చేరి ఎవరి పొలం ఎక్కడ ఉందో తెలుసుకోలేని పరిస్థితిలో ఉందని వారు ఆవేధన చెందుతున్నారు. పొలాల్లో చేరిన మట్టిని, ఇసుకను తొలగించేందుకు రూ.లక్షలు కావాలని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో ఎక్కడ చూసినా తెగిన రోడ్లు, గండ్లు పడిన చెరువులు, బురదతో నిండిన కాలనీలు, కూలిన ఇళ్లు దర్శనమిస్తున్నాయి. అధికారులు స్పందించి వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారి రెండు వైపులా మూసుకుపోవడంతో మండల ప్రజలకు పాలు, చికెన్, ఇతర నిత్యవసర సరుకులు, అత్యవసర మందులు, ఆసుపత్రులకు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉందని ప్రభుత్వం వెంటనే స్పందించి తాత్కాలికంగా రహదారిని మరమ్మత్తు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండలంలో రెండు రోజులుగా జీయో, బీఎస్ఎన్ఎల్ సెల్‌ఫోన్ టవర్లు సైతం సిగ్నల్స్ లేక ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్ స్తంభా లు లెక్కకు లేనన్ని విరిగిపోయినట్లు ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు. మండలంలో అతివృష్టితో కరువు ఎర్పడిందని మండల ప్రజలు ఆవేదన చెందుతున్నారు.



నాగారం వద్ద కూలిన కాసుల కత్త వంతెన

గ్రామాల్లో పెరిగిపోతున్న కుక్కల బెడద



స్వైర విహారం చేస్తున్న కుక్కలు



గాయాలపాలైన బాలుడు

- పట్టించుకున్న వారే కరువు
- పిల్లలపై దాడులు భయాందోళనలో తల్లిదండ్రులు

మోపాల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రోజురోజుకు కుక్కల బెడద పెరిగిపోతుండడంతో పిల్లల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. ఒంటరిగా పిల్లలను ఇంటి నుంచి బయటకు పంపాలంటే భయంగా ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు మండలంలోని ఒక్కొక్క గ్రామంలో 25 నుంచి 30 వరకు ఉన్నాయి గ్రామాల్లో చిన్నపిల్లలపై దాడులు చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి కుక్కల దాడులను గమనించలేక పోతే ప్రాణాలను తీసేస్తున్నాయని గ్రామీణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు గతవారం రోజుల క్రితం నగర సమీపంలోని మాధవ నగర్ కమ్మ సంఘం వెనుక ఓ బాలుడు పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఈ బాలుడితో పాటు మరో బాలికపై కూడా దాడి చేయడానికి కుక్కలు ప్రయత్నిస్తున్నంతో స్థానికులు కుక్కలను బెదిరించడంతో పారిపోయాయి. తీవ్రంగా గాయపడ్డ ఆ బాలుడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు రెండు మూడు రోజులపాటు ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఈ గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని స్థానిక మాజీ కార్పొరేటర్ ప్రమోద్ కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకున్న వారే కరువయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు కుక్కలపై దృష్టి పెట్టకపోవడంతో గ్రామాలలో కుక్కలు పెరిగిపోతున్నాయి. వాటిని నియంత్రించడానికి అధికారులు ఎలాంటి చర్య తీసుకోకపోవడంతో గ్రామీణ ప్రజలు బయట తిరగడానికి ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక్కొక్కసారి కుక్కలకు సంబంధించిన ఇంజక్షన్ లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నారు. దీన్ని ఆసరా చేసుకొని ప్రైవేట్ ఆసుపత్రి వారు విపరీతంగా దోచుకుంటున్నారని గ్రామీణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు దృష్టి పెట్టి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

వరద బాధితులకు సాయం అందించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



బాధితులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్రకార్యదర్శి జాన్‌వెస్లీ, నాయకులు

కామారెడ్డిటౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వరద బాధితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయం అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. గురువారం కామారెడ్డి పట్టణంలో వరద ముంపుకు గురైన ప్రాంతాలను పరిశీలించారు. వరదను అంచనావేయడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. ప్రజలను అప్రమత్తం చేసుంటే ఇంత పెద్ద ఎత్తున నష్టం జరిగి ఉండేది కాదని తెలిపారు.వరదలవల్ల జీఆర్‌కాలనీ, హౌసింగ్ బోర్డుకాలనీ,కౌండిన్య కాలనీలలో ఇళ్లు బురద మయంగా మారిందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే భోజన, నీటి సౌకర్యాలు కల్పించాలని వారికి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాలలో వరదలకు విద్యుత్ సౌకర్యాలు, తాగునీటి పరిస్థితులు లేక ప్రజలు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్‌కు తగిన సహాయసహకారాలు అందించాలని విన్నవించారు. జిల్లాలో జరిగిన నష్టనివారణకు రూ.2 వేల కోట్లను ప్రకటించాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రనాయకులు నరసింహరావు, వెంకట్‌రాములు, శోభన్‌నాయక్, జిల్లా నాయకులు చంద్రశేఖర్, వెంకట్‌గౌడ్, కొత్త నర్సింలు, రేణుక,అరుణ్, మోహన్, శ్రీను పాల్గొన్నారు.

ఎకరాకు రూ.20వేల నష్టపరిహారం చెల్లించాలి

భిక్కనూరు: భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం ఎకరాకు రూ.20వేల నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. శుక్రవారం భిక్కనూరు మండలంలోని లక్ష్మీదేవునిపల్లి- అంతంపల్లి గ్రామాల మధ్యలో ఉన్న ఎడ్లకట్ట వాగు, గ్రామంలో అకాల భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతంపల్లి - లక్ష్మీదేవునిపల్లి గ్రామాల మధ్య ఉన్న ఎడ్లకట్ట వాగుపై బ్రిడ్జి లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే వాగు పారడంతో ఇరు గ్రామాల ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సీఎం స్పందించి వెంటనే ఈ వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. కామారెడ్డి, మెదక్ జిల్లాలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం వెంటనే చెల్లించి రైతులకు అండగా నిలబడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నర్సింహారావు, శోభన్, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన బురుజులను తొలగించండి



బూర్గుపల్లి గ్రామంలో కూలిన బురుజును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

పెద్దకొడప్గల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో గల శిథిలావస్థకు చేరిన పురాతన బురుజులను తొలగించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అధికారులను ఆదేశించారు. మం డలంలోని బూర్గుపల్లి గ్రామంలో పాత కాలం నుంచి ఉన్న బురుజు శిథిలావస్థకు చేరి కూలుతుండటంతో ఇలాంటి బురుజులను తొలగించాలని అధికారులను ఆదేశించారు. బురుజులను కూల్చేందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. దీంతో పాటుగానే మండలంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు, ఇళ్లు తదితర వాటి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు త గ్గుముఖం పట్టేంత వరకు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ చూసుకోవాలన్నారు. అంతకు ముం దు మండల కాంగ్రెస్ నాయకులు అధికారులతో కలిసి బూర్గుపల్లి, వడ్లం తదితర గ్రామాలలో కూలిన ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి మాట్లాడుతు భారీ వర్షాల కారణంగా నష్టపోయిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఎవరూ అధైర్య పడవద్దని సూచించారు. ఈ కార్రక్రమంలో మండల తహసీల్దార్ దశరథ్, మండల ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి, ఆర్ఐ అంజయ్య, నాయకులు డాక్టర్ సంజీవ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కోతకు గురైన రోడ్డును పూడ్చిన పోలీసులు

ఇందల్వాయి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు మండలంలోని పాటితండా వాగు వరద ఉధృతికి ఆర్‌అండ్‌బీ రోడ్డు కోతకు గురైంది. పెద్ద చెట్టు రోడ్డుపై పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ఎస్సై సందీప్ సంఘటన స్థలానికి చేరుకొని రోడ్డుపై పడినచెట్టును తొలగించివేశారు. అనంతరం మొరం, మట్టిని పోసికోతకు గురైన రోడ్డుపై తాత్కాలిక మరమ్మతులు చేయించి వాహనాలు వెళ్లేలా చూశారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండాచేశారు.

ఉత్తర తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి: బీఎల్‌పీ

నిజామాబాద్ కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాలకు అతలాకుతలమైన ఉత్తర తెలంగాణకు కేంద్రప్రభుత్వం వెంటనే నిధులను విడుదల చేయాలని బహుజన లెఫ్ట్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు లత డిమాండ్‌చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, నిర్మల్, నిజామాబాద్ తదితర ప్రాంతాల్లో రోడ్లు, పంటలు, ఇళ్లు దెబ్బతిన్నాయని ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం దెబ్బతిన్న ప్రాంతాల్లో మంచినీటి సౌకర్యం, విద్యుత్ లైన్లు, డ్రైనేజీ వ్యవస్థ యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆమె కోరారు.

వరద బాధితులకు పండ్లు, పులిహోర పంపిణీ

డిచ్‌పల్లి, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం(బీ) గ్రామంలోని పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజలకు శుక్రవారం ఎంపీడీవో రాజ్‌వీర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నీరడి పద్మారావు పులిహోర, పండ్లను పంపిణీ చేశారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా బర్దిపూర్ చెరువు అలుగు పారి ఎక్కువ మొత్తంలో లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు వచ్చి చేరడంతో కాలనీవాసులను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ దాసరి లక్ష్మీనర్సయ్య, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు శక్కరికొండ కృష్ణ, మాజీ ఎంపీటీసీ వడ్డం నర్సయ్య, మాజీ సర్పంచ్‌లు లింగం, సాయిలు, అంజయ్య, తదితరులున్నారు.

నిజాయితీని చాటుకున్న హోంగార్డ్

సుభాష్‌నగర్, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డ్ నిజాయితీని చాటుకున్నాడు. శుక్రవారం ఉదయం 9గంటల సమయంలో రాజేశ్వర్ అనే ప్రైవేటు ఉద్యోగి ఆఫీస్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో ఖలీల్‌వాడి ప్రాంతంలో జేబులోంచి సెల్‌ఫోన్ పడిపోయింది. అక్కడవిధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ హోంగార్డ్ గంగామోహన్ సెల్‌ఫోన్‌ను గుర్తించి సెల్‌ఫోన్ యజమాని రాజేశ్వర్‌ను పిలిచి అతనికి సెల్‌ఫోన్‌ను అందజేశారు. హోంగార్డ్ గంగామోహన్‌ను ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌లు అభినందించారు.

వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల పరిశీలన



బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

ధర్పల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను పీఆర్‌ఈఈ శంకర్, ఏఈ బాలాజీ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించారు. మండలంలోని దుబ్బాక, ధర్పల్లి గ్రామాల మధ్యగల వంతెన గురువారం తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఇంజనీరింగ్ అధికారులు తెగిన బ్రిడ్జిని పరిశీలించి తాత్కాలికంగా మరమ్మత్తులు చేసే విషయాన్ని పరిశీలించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న బీటీ రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిలు, మెటల్ రోడ్లను ఈ సందర్భంగా వారు పరిశీలించి తుది నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారు తెలిపారు. వారి వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, ధర్పల్లి సింగిల్ విండో చైర్మన్ చెలిమెల మల్లికార్జున్, తదితరులు ఉన్నారు.

తపాలా మెయిల్ బాక్సుల అందజేత

డిచ్‌పల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి తపాలా ఉపకార్యాలయంలో శుక్రవారం సౌత్ సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుస్మిత బెనర్జీ ఓవర్సిస్ సబ్ పోస్టు మాస్టర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో తపాలా మెయిల్ బాక్సులను అందజేశారు. వీటితో కొత్త మొబైల్ చేయూత పెన్షన్‌లకు బీవోలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. శుక్రవారం డిచ్‌పల్లిమండలంలోని డిచ్‌పల్లి, సుద్దపల్లి, కొరట్‌పల్లి, యానంపల్లి, నడిపల్లి, పడకల్, కులాస్‌పూర్, దూస్‌గాం, మెంట్రాజ్‌పల్లి, కేశ్‌పల్లి, సికింద్రాపూర్ ఈవోలకు పెన్షన్‌ల మొబైల్‌ను పంపిణీ చేశారు.

వరద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



మోపాల్‌లో బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి



డిచ్‌పల్లిలో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మోపాల్, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ మండలంలోని పాంగ్రా గ్రామ శివారులో వరద బాధితులను శుక్రవారం రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పరామర్శించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వాగుపక్కన ఉన్న నిరుపేద కుటుంబీకులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వారిని ఎమ్మెల్యే భూపతిరెడ్డి పరామర్శించి బాగోగులను తెలుసుకున్నారు. సురక్షిత ప్రాంతంలో ఉన్న బాధితులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అన్నారు. వైద్యసేవలను కూడా అందిస్తున్నారు. ఆయనవెంట ఏఎంసీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

పునరావాస కేంద్రం పరిశీలన

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం ధర్మారం (బీ) గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరూ ఆందోళన చెందవద్దని అన్నారు. వర్షాలు తగ్గేంత వరకు అన్ని రకాల వసతులు కల్పించాలని సరైన భోజనం, మంచి నీటి సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట తహశీల్దార్ సతీష్, ఎంపీడీవో రాజ్‌వీర్, విండో చైర్మన్ రాంచందర్‌గౌడ్, పార్టీ నాయకులు వాసుబాబు, భాస్కర్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిని అసెంబ్లీలో ఎండగడతాం

» రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాళేశ్వరం ప్రాజెక్టు కుంభకోణంపై శనివారం నుంచి జరగనున్న అసెంబ్లీలో కేసీఆర్, హరీష్‌రావులను ఎండగడుతామని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. శుక్రవారం బైపాస్ రోడ్‌లోని రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ సమావేశంలో కాళేశ్వరం అవినీతి నివేదికను ప్రవేశపెడుతామని, కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.లక్ష కోట్లు ఖర్చు పెడితే వందేళ్లు ఉండాల్సిన ప్రాజెక్టు మూడేళ్లకే కూలిందన్నారు. కాళేశ్వరంపై కమిటీ ఇచ్చిన నివేదికను ఎందుకు తప్పుబడుతున్నారని అన్నారు. 42 శాతం బీసీలకు రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో బిల్లు పెడితే బీజేపీ, బీఆర్ఎస్‌లు మద్దతు ఇచ్చాయని, ఇప్పుడు మాట మార్చాయని అన్నారు. కొత్తగా బీసీల రిజర్వేషన్లలో ఎవరిని చేర్చలేదని, గతంలో ఉన్నవారే ఉన్నారని కావాలని బీజేపీ ముస్లింల రిజర్వేషన్ల విషయంలో రాద్ధాంతం చేస్తుందన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో గత వందేళ్లలో లేని వర్షం కురిసిందని వరదలతో తీవ్రంగా పంటనష్టం జరిగిందని, వరదలపై ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్ష జరుపుతూ ఎక్కడ కూడా ప్రాణనష్టం జరుగకుండా చూశామన్నారు. అధికారుల నుంచి పూర్తిస్థాయి నివేదికలు వచ్చిన తర్వాత నష్టపరిహారం ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. సమావేశంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి, డిచ్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్, రాంచందర్‌గౌడ్, బాగారెడ్డి, నరేందర్, రాజలింగం, తదితరులు పాల్గొన్నారు.

వరదతో నష్టపోయిన బాధితులను ఆదుకోవాలి



తెగిన రోడ్డును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి

సిరికొండ, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): ఇళ్లల్లోకి వరదచేరి సర్వం కోల్పోయిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని నిజామాబాద్‌రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి మండలంలోని గడ్కోల్, కొండూర్ వాల్గోట్ తదితర గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లను, పంట పొలాలను శుక్రవారం పరిశీలించారు. గడ్కోల్, కొండూర్, వాల్గోట్ గ్రామాల్లో ఇళ్లల్లోకి వరద నీళ్లు వెళ్లి పలు కుటుంబాల వారు వస్తువులను, బియ్యాన్ని, బట్టలను, వంట పాత్రలను కోల్పోయారని బాజిరెడ్డి చెప్పారు. కలెక్టర్ స్పందించి తక్షణమే గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి భోజనాన్ని అందించాలని ఆయన డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు తక్షణమే బియ్యాన్ని, వంట సామగ్రిని అందించాలని ఆయన అధికారులను కోరారు. దెబ్బ తిన్న రోడ్లను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని బాజిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయనవెంట ధర్పల్లి మాజీ జడ్పీటీసీ సభ్యులు బీఆర్ఎస్ నియోజకవర్గం నాయకులు బాజిరెడ్డి జగన్, బీఆర్ఎస్ అధ్యక్షుడు నారవోయిన శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ రాజన్న, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ముంపు గ్రామాలను సందర్శించిన బాజిరెడ్డి గోవర్ధన్

ధర్పల్లి: మండలంలో ముంపునకు గురైన గ్రామాలను శుక్రవారం నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ధర్పల్లి మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌లు సందర్శించారు. మండలంలోని వాడి, ఒన్నాజిపేట్, నడిమితాండా, బీరప్ప తండా గ్రామాలను సందర్శించి ముంపు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా నిత్యవసర వస్తువులను అందజేశారు. వర్షానికి దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి యుద్ధప్రాతిపధికన రోడ్డు మరమ్మతు పనులను చేయాలని అధికారులకు సూచించారు. పంట నష్టం ఎంత జరిగిందో అంచనావేసి ఎకరానికి రూ.50వేల నష్టపరిహారం ప్రభుత్వం అందజేయాలని డి మాండ్ చేశారు. ఆయనవెంట షైపాల్ యాదవ్, రాజ్‌పాల్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

ఘనంగా గణపతి పూజలు

నిజామాబాద్‌కల్చరల్, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో, మండపాల్లో గణపతి విగ్రహాలకు వేదమంత్రాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మండపాల్లో భక్తులు సామూహిక గణపతి పూజలు నిర్వహించి భక్తి పాటలు పాడారు. భజనలు, సంకీర్తనలు చేస్తూ గణనాథునికి విశేషపూజలు చేశారు. పలు మండపాల నిర్వాహకులు ప్రత్యేక అలంకరణలతో ప్రత్యేకతను చాటుకున్నారు. జిల్లాకేంద్రంలోని సార్వజనిక్ గణేష్ ఆలయం, లక్ష్మీగణపతి ఆలయం, శుభం కరోతి ఆలయం, మహాగణపతి ఆలయం, వరసిద్ధి వినాయక ఆలయంతో పాటు యోగేష్ గణేష్ మండలి, మార్వాడి గణేష్ మండలి, వైశ్య గణేష్ మండలి, రవితేజ యూత్, భాగ్యశ్రీ గణేష్ మండలి, భక్తహిందు గణేష్ మండలి, నాందేవ్‌వాడ గణేష్ మండపాల్లో ప్రత్యేక పూజలు సాగాయి.

సిరికొండలో 3,540 ఎకరాలలో పంట నష్టం

సిరికొండ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో 3,540 ఎకరాలలో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖఅధికారులు తెలిపారు. భారీవర్షాలతో మండలంలో దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులు శుక్రవారం పరిశీలించారు. వ్యవసాయ అధికారి నర్సయ్య, ఏఈవోలు గ్రామాల్లో పంట నష్టపోయిన వివరాలను సేకరించారు. ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక పంపించినట్లు నర్సయ్య తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సుమారుగా వరి పంట 3540 ఎకరాలలో నష్టం వాటిల్లినట్లు చెప్పారు. మొక్కజొన్న వంద ఎకరాలు, సోయా 40 ఎకరాలుగా నష్టం జరిగినట్లు అంచనాకు వచ్చినట్లు తెలిపారు.

ఎటుచూసినా.. ఇసుక మేటలే

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. ఉద్యానవన పంటలు 252 ఎకరాలలో 139 మంది రైతులు నష్టపోగా ఇతర పంటలు 10 ఎకరాలల్లో ఆరుగురు రైతులు నష్టపోయినట్లు అధికారులు నివేదికలు సిద్ధం చేశారు. జిల్లావ్యాప్తంగా 11 మండలాల్లో 1021 ఎకరాలలో ఇసుక మేటలు వేశాయి. ముఖ్యంగా సిరికొండ మండలం కొండూరు, పెద్దవాల్గోట్, తూంపల్లి, గడ్కోల్ గ్రామాల్లో, ధర్పల్లి మండలం వాడి, బీరప్పతండా, నడిమితాండాలలో పొలాల్లో ఇసుక మేటలు వేశారు.

85 కిలోమీటర్ల మేర పాడైన రోడ్లు

వర్షాల కారణంగా జిల్లాలో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్‌కు సంబంధించి 85కిలోమీటర్ల మేర రోడ్లు పాడయ్యాయి. ఆర్అండ్‌బీకి సంబంధించి 22 రోడ్లు 45కిలోమీటర్ల మేర పాడవగా, 6 కల్వర్టులు, 4 బ్రిడ్జిలు చెడిపోయాయి. దీనివల్ల 5నుంచి 6 కోట్లు మరమ్మతులకు అవసరం ఉన్నట్లు అధికారులు నివేదికలు ఇచ్చారు. శాశ్వత నిర్మాణాలకు 10కోట్ల వరకు అంచనా వేశారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి 33 రోడ్లు 35 కిలోమీటర్ల మేర పాడైనట్లు అధికారులు తేల్చారు. తాత్కాలిక మరమ్మత్తులకు కోటి 50లక్షలు అవసరం ఉండగా 7 కోట్ల వరకు నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా తేల్చారు. ముఖ్యంగా సిరికొండ, ధర్పల్లి, భీంగల్, ఇందల్వాయి మండలాల్లో రోడ్లు పాడయ్యాయి. సిరికొండ మండలం కొండాపూర్ నుంచి కార్నర్ తాండా వరకు రోడ్లు పాడవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. భీంగల్, బడాభీంగల్ మధ్య రోడ్డు కోతకు గురైంది. ఇందల్వాయి వద్ద కూడా రోడ్డు కోతకు గురికావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొండూరు వద్ద బ్రిడ్జి కొట్టుకుపోవడంతో సిరికొండకు బస్సులను నిలిపివేశారు.

విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం

వర్షాలతో విద్యుత్ శాఖకు తీవ్రనష్టం ఏర్పడింది. సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లో పలుచోట్ల విద్యుత్‌స్తంభాలు విరిగిపోగా ట్రాన్స్‌ఫార్మర్లు సైతం ధ్వంసమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 264 స్తంభాలు నేలమట్టం కాగా 92ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. 15.8 కిలోమీటర్ల మేర విద్యుత్ లైన్‌లు పాడయ్యాయి. విద్యుత్ శాఖకు 30లక్షలకు పైగా నష్టం వాటిల్లింది.

నీటమునిగిన పంట పొలాలు

మంజీరా, గోదావరి పరివాహక ప్రాంతాల్లోని గ్రామాలు ప్రస్తుతం ముంపునకు గురయ్యాయి. ఆ ప్రాంతాల్లోని పంట పొలాలన్నీ నీటమునిగాయి. ముఖ్యంగా బోధన్ మండలంలోని కొప్పర్గ, హంగర్గ గ్రామాల్లోకి గోదావరి బ్యాక్‌వాటర్, సాలూరా మండలంలోని ఖాజాపూర్, హున్సా, మందర్న గ్రామాలు మంజీరా పరివాహక ప్రాంతానికి దగ్గరగా ఉండటంతో ఆ గ్రామాల్లోకి వరదనీరు వచ్చి చేరింది. ఈ గ్రామాల ప్రజలను అధికారులు ట్రాక్టర్లు, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాల ద్వారా పునరావాస కేంద్రాలకు తరలించారు. కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో గ్రామాలను సందర్శించి పరిశీలించారు. శ్రీరాంసాగర్ ద్వారా నీటిని విడుదల చేయడం ద్వారా పరిస్థితి అదుపులోకి వస్తుందని తెలిపారు. నవీపేట మండలం మిట్టాపూర్, అల్జాపూర్ గ్రామాలతో పాటు, రేంజల్ మండలం కందకుర్తి, నీలా, తాడ్‌బిలోలి గ్రామ శివారులోని పంట పొలాలు గోదావరి నీటిలో మునిగాయి. మిట్టాపూర్, అల్జాపూర్ గ్రామాల చుట్టూ గోదావరి నీరు చేరడంతో ఆ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

(5వ పేజీ తరువాయి)

కావడంతో రాకపోకలు స్తంభించాయి. రానున్న రెండు మూడు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు అత్యవసర సమయాల్లో పోలీసులు, 100 కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని సూచించారు. ఏమైన కూలిపోయే పరిస్థితుల్లో ఉన్న ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. ఆయన వెంట ఏసీపీ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రావణ్ కుమార్, రూరల్ సీఐ విజయ్ బాబు, ఎస్ఐ చంద్రమోహన్, తదితరులున్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు

(5వ పేజీ తరువాయి)

అన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని శ్రీరాంసాగర్ రిజర్వాయర్ ద్వారా 5 లక్షల క్యూసెక్కులపైచిలుకు వరద జలాలను గేట్ల ద్వారా దిగువ గోదావరిలో వదులుతున్నామని తెలిపారు. దీంతో ముంపు గ్రామాల్లో బ్యాక్ వాటర్ తగ్గి సాయంత్రం నాటికి జలదిగ్బంధం నుంచి బయటకు వస్తామని కలెక్టర్ తెలిపారు. ఎఫ్‌బీఆర్ఎఫ్ బృందాలు 7వ బెటాలియన్ పోలీసు బృందాలు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగిస్తున్నాయని, వరద తగ్గిన వెంటనే దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు తదితర వాటికి యుద్ధ ప్రాదిపాదికన మరమ్మతులు చేసి పునరుద్ధరణ నిర్వహిస్తామన్నారు. భారీవర్షాలతో వరద ఉధృతి కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఆయనవెంట బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ శ్రీనివాస్ తదితరులున్నారు.

ఎరువుల నిల్వ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

బోధన్‌లోని పెగడాపల్లిలో శుక్రవారం ఆకస్మికంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎరువుల గోదామును జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు సరిపడనంత ఎరువులు ఉన్నాయా, యూరియా సరైన మోతాదులో లభిస్తుందా స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే తన దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రాజిరెడ్డి, సెక్రెటరీ, రైతులు, గ్రామస్థులు ఉన్నారు.

సైక్లింగ్ పోటీలు

(5వ పేజీ తరువాయి)

కాదని హాకీ మైదానంలో మేజర్ ధ్యాన్‌చంద్ సామర్థ్యాలకు నిదర్శనం అని అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం వర్ధమాన క్రీడాకారులకు, ఔత్సాహికులకు ప్రోత్సహించడానికి ఉపయోగపడుతుందని అన్నారు. మైదానం వెలుపల క్రమశిక్షణ, ఐక్యతను పెంపొందించడం ద్వారా ఛాంపియన్‌గా ఎదుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో రవి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం సరళ మహేందర్‌రెడ్డి, శ్యామ్‌కుమార్, పీఈటీ శ్రీకాంత్, సైక్లింగ్ సంఘం సభ్యులు దుర్గామల్లేష్, ప్రభాకర్, నరేష్‌కుమార్, మురళి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

తుది ఓటరు జాబితా
రూపకల్పనకు సహకరించాలి

» కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రాలు, గ్రామ పంచాయతీలు, వార్డుల వారిగా విడుదలచేసిన ముసాయిదా ఓటరు జాబితా పోలింగ్ కేంద్రాల జాబితాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 30వరకు తెలియజేయాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు జరిపిన మీదట సెప్టెంబర్ 2వ తేదీన వార్డు, గ్రామ పంచాయతీల వారిగా ఫోటోలతో కూడిన తుది ఓటరు జాబితాను ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాలు, వార్డుల వారిగా ముసాయిదా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను ఈనెల 28న ప్రదర్శించినట్లు చెప్పారు. ముసాయిదా జాబితా పోలింగ్ కేంద్రాల విషయంలో ఎలాంటి అభ్యంతరాలున్నా ఈనెల 30 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. 31న అభ్యంతరాలను పరిష్కరిస్తామని సెప్టెంబర్ 2న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. ఈనెల 30న మండలస్థాయిలో రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటుచేస్తామన్నారు. తుది ఓటర్ల జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, జెడ్పీసీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ అధ్యక్షుడు నరేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జాబితా రీషెడ్యూల్ చేయాలి

జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

ముసాయిదా జాబితాను రీషెడ్యూల్ చేయాలని జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ పార్టీ సమావేశంలో విఠల్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముసాయిదా జాబితాను వారం ముందే విడుదల చేసుంటే బాగుండేదన్నారు. వరదల నేపథ్యంలో ముసాయిదా జాబితాను రీషెడ్యూల్ చేయాలని కోరారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాష్ట్రంలో చాలాప్రాంతాల్లో నీటమునిగాయని అన్నారు. సుమారు 17వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని అన్నారు. ఎకరానికి రూ.25వేల ప్రభుత్వం పరిహారం ఇవ్వాలన్నారు. గత 50 ఏళ్లలో ఎన్నడూ ఇలాంటి వర్షాన్ని చూడలేదన్నారు. పార్టీ కమిటీ సైతం ఎన్నికల కమిషన్‌కు విన్నవించిందని అన్నారు. ముసాయిదా జాబితాను రీషెడ్యూల్ చేయాలని కోరారు.

జెండా బాలాజీ మందిరంలో ప్రత్యేక పూజలు

నిజామాబాద్ కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జెండా బాలాజీ మందిరంలో జెండా జాతరను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం వేదపండితులు యోగేష్ ఆచార్య వేదమంత్రాలు పఠించగా ఆలయ అర్చకులు నాగరాజ చార్య వెంకటేశ్వర స్వామికి అభిషేకం నిర్వహించారు. శుక్రవారం కావడంతో జెండాను దర్శించుకోవడానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం ప్రారంభమైన భక్తుల రద్దీ మధ్యాహ్నం వరకు సాగింది. సాయంత్రం ఆలయంలో వేదపండితుల వేదమంత్రోచ్చరణలతో జెండాకు వంశపారంపర దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వంశపారంపర అర్చకులు అజయ్ సంగ్వాయ్, సంజీవ్ సంగ్వాయ్, విజయ్, ఆలయ చైర్మన్ ప్రమోద్, కార్యనిర్వాహణ అధికారి వేణు తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన అధికారులు

ఇందల్వాయి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రయాన్‌పల్లి, త్రియంబక్‌పేట్ గ్రామాలలో అకాల వర్షాల కారణంగా వరద దాటికి నష్టపోయిన పంట పొలాలను వ్యవసాయ అధికారి ప్రవీణ్ శుక్రవారం రైతులతో పరిశీలించారు. నష్టపోయిన పంటలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రకాష్‌గౌడ్, ప్రశాంత్, రమాకాంత్ పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునఃరుద్ధరణ పనులు

సిరికొండ, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడ్కోల్ సెక్షన్ పరిధిలో వర్షాలతో నిలిచిన విద్యుత్ సరఫరాను యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతూ పునఃరుద్ధరిస్తున్నారు. హొన్నాజిపేట్ గ్రామ పరిధిలోని ముత్యాల ప్రాజెక్టు తెగిపోవడంతోపాటు, తూంపల్లిలో అత్యధికంగా కురిసింది. భారీగా వచ్చిన వరదతో విద్యుత్ నియంత్రికలు, స్తంభాలు దెబ్బతినడంతో హొన్నాజిపేట్, వాడి, నడిమితండా, బీరప్పతండా, మూషీర్‌నగర్, కొండపూర్, తూంపల్లి గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచింది. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. మూషీర్‌నగర్‌లో జరుగుతున్న పనులను ఎస్ఈ రవీందర్, డీఈ రమేష్, ఏడీఈ శ్రీనివాస్ పర్యవేక్షించారు.

సినిమా గైడ్

దేవి	: కొత్తలోక (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్	: కూలీ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్	: బ్రహ్మాండ (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్	: సుందరకాండ (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1	: బ్రహ్మాండ (11.00, 10.30): కొత్తలోక (1.30)
	: త్రిబణదారి బార్బరిక్ (4.30) : కూలీ (7.20)
స్క్రీన్-2	: కొత్తలోక (11.00, 7.30) : కూలీ (1.30)
	: సుందరకాండ (4.40, 10.30)
స్క్రీన్-3	: మహావతార్ నరసింహ (1.30, 4.30, 10.20)
	: త్రిబణదారి బార్బరిక్ (7.30)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1	: కొత్తలోక (10.40, 7.25, 10.30)
	: మహావతార నరసింహ (1.45, 4.35)
స్క్రీన్-2	: పరం సుందరి (హిందీ) (10.40, 1.35, 4.30, 7.25, 10.20)
స్క్రీన్-3	: త్రిబణదారి బార్బరిక్ (11.35, 8.05)
	: కన్యాకుమారి (2.20)
	: సుందరకాండ (5.10, 10.50)
స్క్రీన్-4	: కేపీ అగ్రహారంలో అంబేద్కర్ (10.05)
	: అర్జున్ చక్రవర్తి (1.00)
	: కూలీ (3.45, 10.50)
	: వార్-2 (హిందీ) (7.15)



బిస్కెట్ (10గ్రా.)	ఆర్నమెంట్(10గ్రా.)	వెండి(10గ్రా.)
రూ.103,900	రూ.95,900	రూ.1235

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.165	రూ.250	రూ. 270
వెన్‌కాబ్(కిలో)	రూ.170	రూ.260	రూ. 280

